క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం


ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులు

రాంబిల్లి: అప్పారాయుడుపాలెంలో మంగళవారం ఆంజనేయస్వామి వారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ(తేజ), వైఎస్సార్‌సీపీ నాయకులు కోవెలపల్లి హరి, ఉప్పులూరి నాయుడు, సుందరపు బాబు తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా జువ్వాలమ్మ పండగ


జువ్వాలమ్మను దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : మండలంలోని గంటవానిపాలెంలో మంగళవారం జువ్వాలమ్మ పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, పాలసంఘం అధ్యక్షులు కన్నబాబు, సర్పంచ్ కోన వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు భాస్కరరావు, అప్పలరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోటవురట్ల: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో సుజాత తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని కోటవురట్ల మండలం బోడపాలెం శివారు కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు ఎస్సీ కేటగిరీకి, సుంకపూరు కేంద్రంలో ఆయా పోస్టు ఎస్టీ కేటగిరీకి కేటాయించినట్టు పేర్కొన్నారు. అర్హత గల వారు దరఖాస్తులను ప్రాజెక్టు కార్యాలయంలో ఈ నెల 13వ తేదీలోగా అందజేయాలని సూచించారు. అర్హత పొందిన అభ్యర్థులకు మౌఖిక పరీక్ష కోసం కాల్‌లెటర్స్ అందుతాయని తెలిపారు.

కోడి పందాలాడుతున్న ముగ్గురి అరెస్టు

మునగపాక : మండలంలోని గంటవానిపాలెంలో కోడి పందాలాడుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.2,050 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ విలేకరులకు తెలిపారు. గంటవానిపాలెంలో జువ్వాలమ్మ పండగ సందర్భంగా అనుమతులు లేకుండా కోడి పందాలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఆలీ తన సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆలీ తెలిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు


నాగలక్ష్మికి నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

రాంబిల్లి : సంస్కృతి, సంప్రదాయాలకు రంగవల్లులు ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. మంగళవారం అప్పారాయుడుపాలెంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఆయన చేతులు మీదుగా నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.8 వేల నగదును పైల నాగలక్ష్మికి అందించారు. ద్వితీయ, తృతీయ బహుమతులను ఎస్.లత, వెంకటలక్ష్మి సాధించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ(తేజ) తదితరులు పాల్గొన్నారు.

గణపర్తిలో తోడపెద్దు మృతి

మునగపాక: మండలంలోని గణపర్తిలో తోడపెద్దు మృతిచెందింది. ఇదే గ్రామానికి చెందిన కర్రి వారి తోడపెద్దు అనారోగ్యం కారణంగా సోమవారం రాత్రి మృతి చెందింది. దీంతో గ్రామస్తులు పలు సేవగరిడీల నడుమ మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. దారి పొడవునా తోడపెద్దును చూచేందుకు ప్రజలు తరలివచ్చారు.

కన్వీనర్లు, గృహసారథులే పార్టీకి వారధులు

గృహసారథులు, కన్వీనర్ల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు


సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు


వలంటర్లకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

యలమంచిలి : గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్‌సీపీ అధిష్టానం నియమించిన మండల కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని విజయపథంలో నడిపించాలని ఎమ్మెల్యే కన్నబాబురాజు పిలుపునిచ్చారు. యలమంచిలి పట్టణంలోని గుర్రప్ప కల్యాణమండపంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయో, లేదో పరిశీలించాలన్నారు. వలంటీర్లతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలు, పార్టీ ఆశయాలను ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థతో ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు అవసరమైన ప్రతి సేవ, ప్రతి సమాచారం సకాలంలో చేరుతోందన్నారు. గత టీడీపీ హయాంలో ప్రజలకు పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించాల్సి వచ్చేదని, అందుకే మన వలంటీర్ వ్యవస్థను చూసి చంద్రబాబు అండ్ కో భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. వలంటీర్లు పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేస్తున్నారని, వారికి చేదోడుగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సమష్టిగా కృషి చేసి రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకరావాలని కోరారు. ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లి సీఎం జగన్ అందిస్తున్న పథకాలతో ఉన్న మేనిఫెస్టోను వారికి అందించి, వారి సంతృప్తి స్థాయికి తెలుసుకోవాలన్నారు. వారి ఫోన్ నంబర్ నుంచి 8296082960 నంబర్‌కు ఒక రింగ్ ఇస్తే.. వారికి ఓ మెసేజ్ వస్తుందని, పథకాల అమలుపై వారి అభిప్రాయం సేకరించాలన్నారు. ఇదంతా వారి ఇష్టప్రకారం మాత్రమే జరగాలని సూచించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ మహిళలు అధిక శాతం వలంటీర్లుగా, గృహసారథులుగా పనిచేస్తుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. యలమంచిలి రూరల్, పట్టణ సచివాలయ మండల కన్వీనర్లుగా నియమితులైన వీసం వాసు, కర్రి శివలను ఎమ్మెల్యే కన్నబాబురాజు దుశ్శాలువాలతో సన్మానించారు. అనంతరం వలంటీర్లకు ప్రభుత్వం అందించిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లు దూది నరసింహమూర్తి, పిట్టా సత్తిబాబు, డాక్టర్ త్రినాథ్, గొర్లె వెంకట్, వైఎస్సార్‌సీపీ నాయకులు, సేనాపతి రాము, గంధం శివ, మళ్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ లబ్ధి


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు


మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అందజేత
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలోని ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. మంగళవారం యలమంచిలి మున్సిపాలిటీ 4వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. యలమంచిలి పాత వీధి సుబ్రహ్మణ్యస్వామి వారి గుడి నుంచి కార్యక్రమం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ అర్హత ఉండి ఇంకా ఎవరైనా పథకాలు అందని వారు ఉంటే వారికి వెంటనే పథకాలు మంజూరయ్యేలా చూడాలని సచివాలయ అధికారులను ఆదేశించారు. ఇటీవల భర్త చనిపోయి ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్న పేద మహిళకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందించారు. మరో ఒంటరి మహిళకు కూడా రూ.5 వేలు సాయం చేశారు. పేద ప్రజల్ని ఆదుకునేందుకు, వారి ఆర్థికాభివృద్ధికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. నియోజకవర్గంలో పేదలకు సాయం చేయడంలో లభించే తృప్తి మరెందులోనూ దొరకదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదరిక నిర్మూలన జరుగుతోందన్నారు. కుల, మత భేదాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేస్తూ అవినీతి రహిత పాలన అందిస్తూ దేశంలో మిగిలిన రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో భారతదేశంలో ముఖ్యమంత్రులందరిలో నెంబర్‌వన్‌గా జగన్ నిలిచారని కొనియాడారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు జగన్‌ను సీఎంను చేసేలా ఆశీర్వదించాలని కోరారు. ప్రతి పక్షాలన్నీ ఏకమైనా సీఎం జగన్ ప్రభంజనాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్(చిన్నా), మళ్ల కొండబాబు, కౌన్సిలర్లు కర్రి శివ, త్రినాథ్, గొర్లె వెంకట్, పిట్టా సత్తిబాబు, దూది నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంధం శివ, గొలగాని నాగు, ఒగిబోయిన చిరంజీవి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

హామీ నిలబెట్టుకున్న మంత్రి అమర్‌నాథ్


మునగపాక వద్ద జేసీబీతో పూడిమడక రోడ్డు మరమ్మతు పనులు

మునగపాక : రాష్ట్ర ఐటీ, వాణిజ్య పన్నుల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇచ్చిన హామీ మేరకు పూడిమడక రహదారి మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. దీంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల మేర పూడిమడక రోడ్డు మరమ్మతులకు గురైన విషయం తెలిసిందే. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గోతుల్లో పడి కొంతమంది గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ ప్రాంతానికి వచ్చిన మంత్రి అమర్‌నాథ్‌కు స్థానికులు రహదారి మరమ్మతులపై మొరపెట్టుకున్నారు. స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి రూ.కోటి మేర నిదులు మంజూరు చేయించారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మునగపాక దరి కోతకు గురైన రహదారిని జేసీబీ సాయంతో సరి చేస్తున్నారు. అలాగే గోతులను పూడ్చేందుకు అవసరమయ్యే చర్యలు చేపట్టారు. దీంతో ఈ మార్గం మీదుగా ప్రయాణం సాగించేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ


కె.వెంకటాపురంలో పోషకాహారంతో లబ్ధిదారులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించారు. పాలు, గుడ్లు, చిక్కీలు, పోషణ పిండి ప్యాకెట్లు అందజేసి పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. ఇంట్లో లభించే కూరగాయలు, పప్పు దినుసులతో పోషకాహారాన్ని సమీకరించుకోవాలన్నారు.

భూసారం ఆధారంగా పంట సాగుతో మేలు


వరి సాగు చేసే రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

మునగపాక : విత్తన శుద్ధి ద్వారా తెగుళ్లను నివారించవచ్చని అనకాపల్లి రైతు శిక్షణా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భవాని అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో వరి పైరును మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి సాగులో జాగ్రత్తలు పాటించాలన్నారు. వరిలో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించామని నివారణకు గాను లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే ఎకరాకు కార్బోఫ్యూరాన్ గుళికలు(3 గ్రాములు) పది కిలోల పొడి ఇసుకలో కలిపి వెదజల్లాల్సిందిగా సూచించారు. అలాగే భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు వేసుకోవాలని డాట్ సెంటర్ ఏవో విజేత కోరారు. కార్యక్రమంలో వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వీఏఏ తులసి, రైతులు రామజోగినాయుడు, సోమేశ్వరరావు, సన్యాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ


బీరువాను పాఠశాలకు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నక్కపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలకు బీరువా బహూకరించారు. 1976–77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.12 వేలు విలువైన ఈ బీరువాను పాఠశాల కోసం కొనుగోలు చేశారు. దీన్ని డీవీ రామారావు, నూకయ్య శెట్టి, గోపాలాచార్యులు చేతుల మీదుగా హెచ్ఎంకు అందజేశారు. పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేస్తున్న సహాయ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచార్యులు, రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు నిధులు తగ్గింపుపై నిరసన



నినాదాలు చేస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు

పాయకరావుపేట: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకం పనులకు తక్కువగా నిధులు కేటాయించం పట్ల ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, ర్యాలీ నిర్వహించారు. గత బడ్జెట్‌లో 89,400 కోట్లు కేటాయించి ప్రస్తుతం బడ్జెట్‌లో 60,000 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. 29,400 కోట్లు భారీగా తగ్గించడం జరిగిందన్నారు. జాబ్ కార్డులు కల్గిన వారందరికీ పని కల్పించాలని, నిధులు పెంచాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెలుగుల అర్జునరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బందుల సుబ్బలక్ష్మి, కార్యదర్శి ఎలిపే రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ

పాయకరావుపేట: మండలంలోని పెంటకోట, గోపాలపట్నం గ్రామ పంచాయతీల్లో గల చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాలను ఈవోఆర్‌డీ సీహెచ్.చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఇంటి పన్నుల వసూళ్ల పై దృష్టి సారించాలని ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు వై.ఎస్.సత్యనారాయణ, రామ్ గోవిందు ఉన్నారు.

ఘన జీవామృతం తయారీపై అవగాహన


ఘన జీవామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పాయకరావుపేట: మండలంలోని ఎస్.నర్సాపురంలో రైతులకు ఘన జీవామృతం తయారీపై వ్యవసాయ శాఖ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామంలో పల్లెల జోగారావు అనే రైతు పొలంలో 1500 కిలోల ఘన జీవామృతాన్ని వారు తయారు చేసి, ఆ విధానాన్ని వివరించారు. దేశీయ ఆవుపేడ, శనగపిండి, బెల్లం, పుట్టమన్ను, మూత్రం కలిపి ఏడు రోజుల పాటు నిల్వ ఉంచితే జీవామృతం తయారవుతుందన్నారు. ఎకరానికి 400 కిలోలు వేస్తే భూమి సారవంతమై మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయ సిబ్బంది చెప్పారు

ప్రజలకు సురక్షితమైన తాగునీరు


గోకులపాడులో జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. తిమ్మాపురం శివారు గోకులపాడులో రూ.68లక్షలతో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామంలోనూ జలజీవన్‌మిషన్ నిధులు కేటాయించినట్లు చెప్పారు. పైపులైన్ పనులు పూర్తి కాగానే ప్రతి ఇంటికి కుళాయిలు వేసి.. గోదావరి జలాలను తాగునీరుగా అందిస్తామన్నారు. ఎంపీపీ కోన లోవలక్ష్మి, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి బొజ్జన్న, నాగంబోయిన శ్రీనివాసరావు, వీర్రాజు, మందగుదుల వెంకటరమణ, అద్దేపల్లి బాబూరావు, చింతలపాటి మణిరాజు, ఉద్దండం సూర్యనారాయణ, ఎస్.రాయవరం, పెనుగొల్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్లు అల్లాడ నాగరాజు, దోసపాత్రుని హనుమంతరావు, పినపాల ప్రసాద్‌రావు, ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ


అగ్ని ప్రమాద బాధితులకు బియ్యం అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయం అందివ్వాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమిదేవపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితులను మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. రేషన్, కొంత నగదును బాధిత కుటుంబ సభ్యురాలు బంగారి రమణమ్మకు అందజేశారు. ఎంపీడీవో రామచంద్రమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, భీమరాజు అప్పలకొండ, ఉద్దండం సూర్యనారాయణ, బాబీ, బంగారి తదితరులు పాల్గొన్నారు

ఎండలో నేవీ నిర్వాసితుల ధర్నా


రోడ్డుపై ఎండలో ధర్నా చేస్తున్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు సాగిస్తున్న ధర్నా 100రోజులు పూర్తి చేసుకుంది. దీంతో మంగళవారం రోడ్డుపై ఎండలో ధర్నా చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, వాడపాలెం, నేవీ పునరావాసకాలనీ, గోవిందపాలెం, కొత్తపేట, చినకలవలాపల్లి గ్రామాల ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు.

వాహన రికార్డులు తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : వాహన చోదకులకు తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలని సీఐ పి.అప్పలరాజు తెలిపారు. మండలంలోని ఆటో డ్రైవర్లతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐలు ఎస్.రమేష్, బి.జోగారావు, ఎస్ఈబి ఎస్ఐ ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రమాబాయికి ఘనంగా నివాళి


రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సమతాదళ్ సభ్యులు

ఎస్.రాయవరం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ఆయన సతీమణి రమాబాయి ఎంతో కృషి చేశారని సమతాదళ్ మండల అధ్యక్షుడు గారా ప్రకాష్ తెలిపారు. రమాబాయి జయంతి సందర్భంగా గోకులపాడులో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాబాయి చేపట్టిన కార్యక్రమాలు విరించారు.ఈ కార్యక్రమంలో సమతాదళ్ సభ్యులు రాజు, అప్పారావు,వాసు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి తీర్మానం


ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ, కమిటీ సభ్యులు

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, రోగులకు సదుపాయాలు కల్పించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తీర్మానించింది. ఈ మేరకు మంగళవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, స్థానిక నేతలతో కమిటీ సభ్యులు చర్చించారు. ఆపరేషన్ థియేటర్‌లో పాడైన ఇన్వర్టర్‌ను బాగు చేయడం, ప్రవేశద్వారానికి ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆస్పత్రికి వచ్చే ఇన్‌పేషెంట్ల కోసం రేకుల షెడ్లు నిర్మించాలని తీర్మానించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల ఆప్యాయత కనబర్చి సకాలంలో వారికి వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.వాణి జగదీశ్వరి, ఎంపీడీవో కె.ధర్మారావు, తుమ్మపాల సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి, పంచదార్ల కన్నారావు, వడ్డాది భారతి, అశోక్, కనుబుద్ది శంకరరావు, పీలా బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.

పట్టర పట్టు.. హైలెస్సా


సాయి మెరైన్ పరిశ్రమ చెందిన బస్సును తోస్తున్న మహిళా కార్మికులు

ఎస్.రాయవరం: సాయి మెరైన్ పరిశ్రమకు చెందిన బస్సు మంగళవారం కొరుప్రోలు జంక్షన్ వద్ద ఆగిపోయింది. దీంతో డ్రైవర్ మహిళా కార్మికుల సాయం తీసుకోవాల్సి వచ్చింది. బస్సులో ప్రయాణించాల్సిన మహిళలు.. ఆగిన బస్సును తోయడంతో స్థానికులు ఆశ్చర్యంగా తిలకించారు. కొంత దూరం బస్సును తోయడంతో స్టార్ట్ అయింది.

శిథిలమైన బస్ షెల్టర్లు


సుంకపూరు జంక్షన్‌లో శిథిలావస్థలో ఉన్న బస్ షెల్టర్

కోటవురట్ల: వేసవి వచ్చేసింది. ఇక భానుడి ప్రతాపం చవిచూడాల్సిందే. వాహనచోదకులు, బాటసారులు, ప్రయాణికులకు అవస్థలు తప్పవు. ప్రధానంగా ప్రధాన కూడళ్లలో బస్సులు, ఆటోల కోసం వేచి ఉండేవారి అవస్థలు వర్ణనాతీతం. బస్ షెల్టర్లు లేకపోవడం, ఉన్నా శిథిలం కావడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని పలు ప్రధాన కూడళ్లలో సుమారు 30 ఏళ్ల క్రితం బస్ షెల్టర్లు నిర్మించారు. అవన్నీ ప్రస్తుతం శిథిలమై ప్రయాణికులు వేచి ఉండేందుకు వీలులేని విధంగా ఉన్నాయి. శిథిలం కావడంతో స్థానికులు సైకిల్ స్టాండ్‌లా వినియోగిస్తున్నారు. అన్నవరం, సుంకపూరు, తంగేడు, పాతరోడ్డు, రామచంద్రపురం జంక్షన్లలో బస్ షెల్టర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. వేసవి ఆరంభంలోనే వీటికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.